క్లుప్తంగా

ఆర్‌పీటీబీ రాష్ట్ర అధ్యక్షుడిగా సాంబయ్య



నర్సంపేట : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ బొజ్జ తారకం (ఆర్‌పీటీబీ) రాష్ట్ర అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన జన్ను సాంబయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని తెలిపారు.

ఎంఈఓకు సన్మానం



రాయపర్తి : ఉత్తమ ఎంఈఓగా ఎంపికైన నోముల రంగయ్యను లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రావుల అనిల్‌కుమార్ మాట్లాడారు. ఎంఈఓగా రంగయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మందాటి సుదర్శన్‌రెడ్డి, సునీల్‌కుమార్, ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న వేంకటేశ్వరస్వామి జాతర



ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటలో ఫిబ్రవరి 2న శ్రీవెంకటేశ్వరస్వామి జాతర నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెన్ను శృతి, ఎంపీటీసీ విజాకర్‌రావు, ఆలయ నిర్మాణకర్త మాదాసి వెంకన్న తెలిపారు. ఆ గ్రామంలో జాతర వాల్‌పోస్టర్లను సోమవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఏటా కల్యాణ మహోత్సవ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పురోహితులు అన్వేశ్ శాస్త్రీ, వెంకటస్వామి, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, కుమారస్వామి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కోదాటి సంపత్‌రావు రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

ముగిసిన ఉర్సు

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. దర్గాలో ముజావర్లు పూజలు నిర్వహించగా పలు గ్రామాల నుంచి భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కవాలి, గంధం, దీపారాధన, మహా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన మైదం ప్రేమలీల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పెగ్గళ్లపాటి లక్ష్మీనారాయణ సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. ఈ డబ్బును ఆయన పంపించగా స్థానికులు కర్ణకంటి రామ్మూర్తి బాధిత కుటుంబానికి అందించారు.

'కాంగ్రెస్ అనుబంధ యూనియన్‌గా ప్రకటించాలి'

నర్సంపేట : ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ)ను కాంగ్రెస్ పార్టీకి అనుబంధ యూనియన్‌గా ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆ యూనియన్ స్థానిక డిపో సెక్రటరీ గొలనకొండ వేణు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకరించాలని కోరారు.

శాస్త్రీయ దృక్పథంతోనే ఉన్నతి



చెన్నారావుపేట : విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం పాపమ్మ



వర్ధన్నపేట : ప్రశంస పత్రాలు చూపుతున్న జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు



పర్వతగిరి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



నెక్కొండ : విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు



నల్లబెల్లి : ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎస్సై



ఖానాపురంలో..

చెన్నారావుపేట : శాస్త్రీయ దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి సాధించగలమని మండల నోడల్ ఆఫీసర్ బైరి సరళ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మోతె లింగారెడ్డి, కన్వీనర్ నరహరి ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీలో వారు మాట్లాడారు. పోటీలో ఉప్పరపల్లి హైస్కూల్, సిద్దార్థ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, మండల కోకన్వీనర్ పత్తి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : స్థానిక హైస్కూల్‌లో నిర్వహించిన చెకుముకి పోటీలను హెచ్‌ఎం వసంత ప్రారంభించారు. అనంతరం ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎస్సై నైనాల నగేశ్ ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేసి మాట్లాడారు. మండల స్థాయిలో ఇంగ్లీష్ మీడియంలో నల్లబెల్లి హైస్కూల్ విద్యార్థులు పూజిత, మధురిత, సుమశ్రీ, తెలుగు మీడియంలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయ విద్యార్థులు ఝాన్సీ, హిమబిందు, కీర్తన జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వసంత తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్తా, జనవిజ్ఞాన వేదిక పర్యవరణ విభాగం జిల్లా కన్వీనర్, చెకుముకి బాధ్యుడు రాయబోస్, మండల కన్వీనర్ రాజయ్య పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటలోని స్కూల్ నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం సయ్యద్ ఆరీఫ్ హుస్సేన్ మాట్లాడారు. పలువురు విద్యార్థులు మండల స్థాయిలో రాణించి జిల్లా స్థాయి పోటీకి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని శ్రీఅరబిందో హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. పోటీలను ఎంఈఓ రంగయ్య పర్యవేక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఇల్లంద జెడ్పీ హైస్కూల్ ప్రథమ, స్థానిక టీఎస్‌ఎంఆర్‌ఐఈఎస్ ద్వితీయ, ల్యాబర్తి జెడ్పీ హైస్కూల్ తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో వర్ధన్నపేట ఆల్ఫోర్స్ ప్రథమ, వుస్కోస్ ద్వితీయ స్థానం, శ్రీఅరబిందో తృతీయ స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన, పాల్గొన్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ సహకారంతో డిక్షనరీలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, పెన్నులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌రావు, జేవీవీ మండల కన్వీనర్ తాబేటి లింగమూర్తి, పాఠశాల డీన్ వీరన్న, గైడ్ టీచర్లు రాజ్‌కుమార్, సంపత్, విజయ్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని జెడ్పీ, ప్రభుత్వ హైస్కూళ్లలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. తెలుగు మీడియంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ మొదటి స్థానంలో, ఇంగ్లీష్ మీడియం విభాగంలో కొంకపాక జెడ్పీ హైస్కూల్ మొదటి బహుమతి గెలుచుకున్నాయి. ప్రైవేటు పాఠశాలల నుంచి కల్లెడ ఆర్‌డీఎఫ్ హైస్కూల్ ప్రథమ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం రమేశ్ మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంచడానికి పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎల్‌టీపీ (ఎల్టా) జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడారు. మొదటి విభాగంలో ప్రభుత్వ హైస్కూళ్లు, రెండో విభాగంలో మోడల్, కస్తూర్బా, టీఎస్ రెసిడెన్షియల్ గురుకులాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్పెల్ విజర్డ్‌లో ప్రథమ బహుమతిని నెక్కొండ హైస్కూల్ నుంచి సొనాలిక, టీఎస్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి సిరిచందన, డ్రామా విభాగంలోనూ ఆయా పాఠశాలలు బహుమతులు సాధించాయి. ఈఎల్‌టీపీ కన్వీనర్ విజయ్‌కుమార్ పర్యవేక్షించగా హెడ్‌మాస్టర్లు రంగారావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



బీమా చెక్కు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : కార్యకర్తల సంక్షేమానికి బీఆర్‌ఎస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల చెన్నారావుపేట మండలంలోని బోడమాణిక్యంతండాకు చెందిన బోడ సురేశ్, నెక్కొండ మండలంలోని చంద్రుగొండకు చెందిన కుతాడి ఎల్లయ్య ప్రమాదవశాత్తు మృతి చెందగా బాధిత కుటుంబాలకు పార్టీ బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్షలు చొప్పున చెక్కులను సోమవారం ఆయన అందజేసి మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ మాలోతు కవిత, తదితరులు పాల్గొన్నారు.

జీఓలు రద్దు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోంది

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీఓలను రద్దు చేస్తూ అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ ఆరోపించారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పాలనలో తీసుకొచ్చిన జీఓలను, పథకాలను ప్రస్తుత ఎమ్మెల్యే ఆపమని చెప్పడంతో ప్రభుత్వం గత ఆరు నెలలుగా నిలిపివేసిందని చెప్పారు. ఎంపీ కవిత మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి అని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కోట్లాది రూపాయల రూపాయల నిధులు తీసుకొచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భవానీ, శ్రీనివాస్

నెక్కొండ : మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సఖి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భవానీ కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడ, మగ పిల్లలను సమాన దృష్టితో చూడాలని ఆకాంక్షించారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు 181, 100 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సఖి కేంద్రం అందిస్తున్న కౌన్సిలింగ్, పోలీస్, న్యాయ, వైద్య తాత్కాలిక వసతి, రెస్క్యూ వంటి సేవలను వివరించారు. అనంతరం చట్టాలపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, సఖి కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ సుధ, కౌన్సిలర్ నిర్మలదేవి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



ఫామ్-18ని ప్రదర్శిస్తున్న టీచర్లు, నాయకులు

చెన్నారావుపేట : ఉపాధ్యాయులు ఫిబ్రవరి 6లోపు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి కోరారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఓటరు నమోదు కోసం ఉపాధ్యాయులకు ఫామ్-18ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. యూనియన్ మండల అధ్యక్షుడు పూజరి సురేందర్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఫామ్-18 అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌ఎన్ మండల నోడల్ అధికారి సరళ, కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, ప్రధాన కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి, ఇంద్రసేనారెడ్డి, కిశోర్, అనుపమ, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, వీరభద్రయ్య పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

- 'మెడికేర్' డైరెక్టర్ ఫాదర్ చిన్నపురెడ్డి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వర్ధన్నపేట : రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా వరంగల్‌కు చెందిన మెడికేర్ జనరల్ హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ చిన్నపురెడ్డి అభివర్ణించారు. మండలంలోని అంబేడ్కర్‌నగర్‌లోని చర్చిలో ఆ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 210 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయగా 22 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం ఫాదర్ చిన్నపురెడ్డి మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఉచితంగా ఓపీ కన్సల్టేషన్ ఉంటుందని తెలిపారు. జనరల్ వార్డులో ఉచితంగా ఆక్సిజన్ అందిస్తారని, వైద్య చికిత్సలో భాగంగా అన్ని వ్యాధులకు 50 శాతం రాయితీ ఉంటుందని, అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, మందుల్లో సైతం 50 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంగోపాల్, డాక్టర్ భూమాత, సాయితేజ, మహేందర్‌రావు, సామాజిక సేవా కార్యకర్త బంక మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



నల్లబెల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వరంగల్‌కు చెందిన అపోలో రీచ్ ఎస్‌ఎస్‌ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ నానబోయిన రాజారాం సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేదలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వైద్యులు నరేంద్ర, అబ్దుల్ కవి పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నాగెల్లి శ్రీనివాస్, ఎస్‌ఎస్‌ఆర్ ఆస్పత్రి సిబ్బంది కోటేశ్, మహేశ్, అఖిల, వైష్ణవి, సౌమ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయసాగర్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. అనంతరం కల్యాణ్ మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. గురుకులాలకు భవనాలు నిర్మించాలని, ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాగరాజు, అభిరామ్, సుశాంత్, రాకేశ్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : నర్సంపేట డివిజన్‌లోని ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడి పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. నియోజకవర్గంలోని అనేక మంది పేదలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నర్సంపేట, నెక్కొండ మండలాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పట్టాలిచ్చి ఇల్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి యాకూబ్, మొలుగూరి శారద, పుచ్చకాయల నర్సింహారెడ్డి, నర్సింహస్వామి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఆ స్కూల్ పూర్వవిద్యార్థి చిర్ర వేణు సోవారం పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, కంపాస్ బాక్స్‌లతోపాటు నెల రోజులకు సరిపడా స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అజ్మీరా ఉమాదేవి మాట్లాడారు. విద్యార్థులకు ప్యాడ్స్, ఇతరత్రా అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ఉల్లెంగల యాదగిరి, బీరం వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జన్ను రమేశ్

నర్సంపేట : విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి గణిపాక బిందు అధ్యక్షత వహించగా రమేశ్ మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సరైన భవనాలు, ఫర్నీచర్, ఉపాధ్యాయులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పేరుక వంశీ, గీత, సాగరిక, శ్రీకాంత్, సాగర్, స్రవంతి, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకం



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ కోమల, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, తదితరులు

దుగ్గొండి : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకమని ఎంపీపీ కాట్ల కోమల, ఎంపీడీఓ కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 34 మంది సర్పంచ్‌లను సోమవారం శాలువాలు కప్పి పూలమాలలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ కోమల, ఎంపీడీఓ కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఐదేళ్లలో సర్పంచ్‌లు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సివిల్ రైట్స్ డే

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామంలో నేడు (మంగళవారం) సివిల్ రైట్స్ డే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొనాలని కోరారు. హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి




నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట గ్రామ మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నమల నర్సయ్య (58) సోమవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, నాయకులు వక్కల చంద్రమౌళి, ఒడేల రవి, మోర్తాల రామారావు, ఇంగ్లే శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని బావనికుంటతండాకు చెందిన ఆంగోతు శ్రీను (28) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన డీసీ తండాకు చెందిన బానోతు శ్రీను కుటుంబాన్ని, ప్రమాదవశాత్తు కాలికి గాయమై ఇంటి వద్దే ఉంటున్న ఆంగోతు భీమాను రమేశ్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లింగారెడ్డి, ఇతరులు

పర్వతగిరి : మండల కేంద్రంలో టీటీయూ రాష్ట్ర శాఖ క్యాలెండర్‌ను స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్, మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య హరిలాల్ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టడంతోపాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీఓ నంబర్ 317 బాధితులకు న్యాయం చేకూర్చాలని, స్పౌజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాక రమేశ్, మడత భాస్కర్, పుల్ల అనిల్‌కుమార్, శ్రీధర్, పరశురాములు, రాజ్‌కుమార్, అశోక్‌కుమార్, గోనె రమేశ్, గారె శ్రీనివాస్, ఉమాదేవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై లింగ వివక్ష తగదు



మాట్లాడుతున్న హెచ్‌ఎం లక్ష్మీనారాయణ

రాయపర్తి : బాలికల పట్ల లింగ వివక్ష తగదని మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధి రమాదేవి తెలిపారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొలన్‌పల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లింగ సమానత్వం, లింగ వివక్ష, బాలికల సెక్స్ రేషియో, బాల్య వివాహ నిరోధక చట్టం, హెల్ప్‌లైన్, 1098, 181, 100, 14567, 108, 112, 1930 నంబర్లపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అన్నాదేవి, శ్రీధర్, సూర్యప్రకాశ్, మచ్చమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.